# మోసం

రచన:
శ్రీ వేముల ప్రభాకరరెడ్డి.

ఆవి నా స్కూలు ఫైనల్ చదువు పూర్తయిన రోజులు. కాలేజి చదువులకై స్వగ్రామాన్ని విడిచి జగిత్యాల్‌కు బయలుదేరాము. ఆనాడు మంగళవారము అంతకు మూడు రోజుల మునుపే సామానుతో సిద్ధమైయున్నాము. ప్రయాణానికి ముందు పూజా పునస్కారాలు పూర్తిచేయించికొని అమ్మ ఇంటినుండి బయలుదేరనీయలేదు. పెట్టెబేడా అంతట ముందే బస్సులో సర్ది వచ్చాడు వేణు. బస్‌స్టాండుకు సమీపములలోనే మా ఇల్లుంది. ఇంటి ముందు నిలబడి నాన్నతో ముచ్చటిస్తున్నాను. అంతలోనే అన్నయ్య వచ్చాడు. 200 రూపాయలిచ్చి జాగ్రత్తగా ఖర్చు చేసుకోమని హెచ్చరించి పోయాడు. పర్సును జేబులో పెట్టుకుంటుండగానే బస్సు హారను వినవచ్చింది. తొందరగా ఇంట్లోని వారందరికి చెప్పి కదులుతున్న బస్సునందుకున్నాను. నా మిత్రులు అప్పటికే ఎక్కడివారక్కడ కూర్చునియున్నారు. నన్ను చూస్తూనే చిరునవ్వు నవ్వాడు గంగాధరుడు. ఆయనతో కాలేజి లైఫ్ గురించి తన ఊహాలు చెబుచున్నాడు. హన్మాండ్లు. వారి సంభాషణలో పాల్గొనాలని నా కనిపించలేదు. నేను జగిత్యాల్ ఎప్పుడు వస్తుందా? అనే ఆలోచిస్తున్నాను. అప్పటికీ అయోధ్య స్టేజ్ దాటింది. కాలేజిలో సీటు దొరుకుతుందో లేదోఅన్న అనుమానము నన్ను పట్టి పీడించుకతింటుంది. టికట్-టికట్ అంటూ ఓవైపు! కండక్టరు పీడించసాగాడు. జేబులో నుండి ఇబ్బందిగా డబ్బుతీశాను. పుచ్చుకున్నాడు. నా ప్రక్కనున్న మరో మిత్రుడిని మాత్రం వదిలేశాడు. 'బ్రతికిపోయావురా! నిజామ్' అన్నాను. 1-30 దక్కినందుకు వాడు సంతృప్తిగా నవ్వుతూ 'వాడంటే నా మాటలకు కరిగిపోతాడు' అన్నాడు. కొద్దిసేపు అలాగే సంభాషణలో పడిపోయాము. బస్సు ఒక్క కుదుపు కుదిపి ఆగిపోయింది. అంతా లేచి సామాన్లు దించుకుని కిరాయింటికి బయలుదేరాము, అక్కడనుండి కాలేజికి.

అప్పటికి పదిగంటలవుతుంది. కాలేజాఫీసులో వాకబు చేస్తే 150 రూపాయల చందా చెల్లిస్తేనేగాని సీటు దొరకదని తెలిసింది. అది ప్రైవేట్ కాలేజి అయినందున దాని నభివృద్ధి పరచడానికి ఈ మొత్తము చందా చెల్లించవలసిందేనని కాలేజి అభివృద్ది మండలివారి అభ్యర్థన పత్రాన్ని చూసినాక మేము గత్యంతరము లేక చందా చెల్లించడానికే సిద్ధమయ్యాము. మున్సిపల్ చేర్‌మెన్ గారే అభివృద్ధి మండలి చేర్‌మెన్ అయినందున ఆ చందాకూడా ఆయనకే చెల్లించాలిట. మున్సిపల్ ఆఫీసు వద్దకు వెళ్ళినాక అనధికార వార్తలనుబట్టి మాకు తెలిసినదేమిటంటే ఎవ్వరిదైనా రికమండేషన్ కాని ఉంటే చందా మొత్తములో కొంత మాఫీకావచ్చునట. కాని నాకు మాత్రము ఆ సిటీలో రికమండ్ చేసే వాడు ఎవరు దొరుకుతారు. నాతో ఉన్న ముగ్గురు మిత్రులు మాత్రము తమకొక మున్సిపల్ మెంబరు పరిచయమున్నాడని ఆయనకోసం బయలుదేరాడు. నేనొంటరివాన్నయిపోయి బిక్కమొగము వేసుకొని బొమ్మలాగా నిలబడిపోయాను. నా పరిస్థితి గమనించినట్టున్నాడు. ఒకతను నావద్ద కొచ్చి కరచాలనంచేశాడు. నాకాయ నెవరో తెలియదు. అయినా సభ్యతకొరకని మొహంపై చిరునవ్వు పులుముకుని ఆయనవైపు చూశాను. ఆయన వెంటనే ఇంకొక వ్యక్తివచ్చినట్టున్నాడు. నేనాయనను గమనించనేలేదు. తెల్లని సూటులో తన నల్లని కాయాన్ని బలవంతంగా ఇరికించినట్టున్నాడు. అటుఇటు కదలడానికే ఇబ్బంది పడిపోతున్నాడు. అలా ఇబ్బందిపడుతూనే నావైపు తన చేతిని పొడిగించాడు. నేను గత్యంతరం లేక చేయి కలిపాను. మొదట నాదగ్గరకు వచ్చినతను ఈ తెల్లసూటు నల్లతన్ని చూపిస్తూ 'ఇతడు నా మిత్రుడు కామేశ్వర్రావు. కాలేజి స్టూడెంట్ యూనియన్ ప్రెసిడెంట్‌షిప్‌కు పోటీచేస్తున్నా'డని నాకు పరిచయం చేశాడు. కామేశ్వర్రావుగారి విషయం గురించి తెలిపే ఒక పెద్ద ప్రసంగానికి పునాదికాబోతున్నట్లు ఆయన తన గుండెను సర్దుకోవడం మొదలెట్టాడు. కాని నాకు పని తొందరున్నందున 'మళ్ళీ కలుస్తానని' ముందుకుసాగాను. కాని నన్నాపి 'మీరు బహుశా చందా చెల్లించడానికి వెళ్తున్నట్టున్నారు. అక్కడ మీ కెవరూ పరిచయం కూడా లేరనుకుంటా'నన్నాడు. నేను నిజమే అన్నట్టు తలూపాను.

మా నాన్న మున్సిపల్ ఆఫీసు మెంబరు. ఒక వేళ మీరు కాలేజి ఎలక్షన్‌లో మాకు సహాయపడేదుంటే మీరు బీద విద్యార్థులన్న నెపంతో కొంత చందా మాఫీ చేయించగలను. అంతేకాదు ఇంకెన్నో విధాల మీకు మా సహాయం అందగలదు' అని ఆయన అనడంతోనే నేను 'సరే' నన్నాను.

పోటీచేస్తున్నాడన్న ఆయన మిత్రుడు మాత్రం నాకు గుడ్‌బై చెప్పి నవ్వుకుంటూ బయటికి వెళ్ళిపోయాడు. అదోలా నవ్వుతూ వెళ్ళిపోతున్నాయన్ను అలాగే చూస్తూ నిలబడిపోయాను. ఇంతలోనే రెండవతను అప్పుడే చేర్మెన్ రూంలోనికి పోయివచ్చిన వాడిలా నవ్వుతూ 'నేను చేర్మెన్ గారితో మాట్లాడాను. మా

(తరువాయి 28వ పేజీలో)

(18వ పేజీ తరువాయి)

బంధువులబ్బాయ్ అని చెప్పాను. సగము మాఫీ చేయడానికి ఒప్పుకున్నాడు. నీవు సరేనంటే డబ్బుకట్టి రసీదు పట్టుకొస్తానన్నాడు. నేను సరేనని డబ్బు ఆయనచేతిలో పెట్టి ఆయన వెంటే కదిలాను. కాని ఆయన నా దుస్తుల వైపు నేను పెట్టుకున్న గడియారం వైపు చూస్తూ 'అయ్యో బాబూ మీ వేశం చూస్తే పెద్ద ధనవంతునిలా గున్నారు. అంతేకాదు, మీ రూపు రేఖలు యే మాత్రం బీదత్వాన్ని సూచించడంలేదు కావున మీ రిక్కడే ఉండండి నేను డబ్బుకట్టి రసీదు పట్టుకొస్తానని ముందుకు కదిలాడు. నా హృదయాంతరాళల్లో యెక్కడో చిన్న అనుమానం కలుక్కుమంది: కాని దానికి సభ్యత అడ్డుగోడై నిలిచింది. అంతకు మునుపే ఆయన చేతిలో పెట్టిన డబ్బును అవిశ్వాసంతో వెనక్కివ్వమని నా సంస్కారం నన్ను అడుగనివ్వలేదు. లేని ధైర్యం తెచ్చుకుని జారిపోతున్న విశ్వాసాన్ని బిగపట్టి ఆయన వైపే తదేకంగా చూస్తుండి పోయాను. చేర్మన్ గది కడ్డంగా వ్రేలాడుతున్న తెరను త్రోసుకుని ఆయన లోనికి వెళ్ళిపోయాడు. ఆ నల్లని తెర ఆయన్ను కనిపించనీయకుండా నా కళ్ళకు కంటి పొరలాగయింది. గడియారం వేగాన్ని దిగమించి నా గుండె కొట్టుకోసాగింది. దాన్నదుపులో పెట్టడం ఆ అనంతకుడు కళ్ళబడితేగాని కుదిగట్టులేదు. చిన్న గాలి లాలలకు కదులుచున్న తెరనుకూడా కనిపెడుతున్నాయి నాకళ్ళు, దాని అవతల యెవరు మెదిలినా చూడాలన్న ఆతృతా విశ్వాసాలతో నా కళ్ళు రెప్పార్చే కళ్ళయ్యాయి. ఎట్టికేలకు తెరకదిలింది. గుండెపై చెయివేసుకుని చూశాను. ఆయనకాదు. ఆయనెవరో? ఒకరూ ఇద్దరూ...ముగ్గురు...ఇలా యెందరో వస్తున్నారు యెందరో పోతున్నారు కూడా యేం చేయడం? ఏమీ తోచడంలేదు. పది నిముషాలు ముళ్ళమీద గడిపిన వాడిలా ఒక్క గంతులో గదిలోనికి వెళ్ళాను. గదిలో ఉన్నవారంతా యెగాదిగా నన్ను చూడసాగారు. చేర్మన్ గారి పెన్ ఆగిపోయింది. దృష్టి నాపైనుండి త్రిప్పడంలేదు. నా గాబరపాటు అక్కడి ఫ్యాన్ కు కోపాన్ని తెప్పించలేదు శాంతంగా యేం కావాలి బాబూ అన్నాడు. ఒకసారి మనసుని స్థిమితం చేసుకొని చుట్టూ కలియ చూశాను. ఒక ప్రక్కను టైపిస్టు, [illegible] లాంటి విద్యార్థులు బెంచీపై కూర్చుని ఉన్నారు, వారి కదురుగానే చేర్ మెన్ గారి చేర్ అందులో ఆయన బిల్ బుక్ లురాస్తూ ఆగిపోయాడు. ఆయనకు వెనుకే మరో ద్వారం. నా గుండెలు గుబేలుమన్నాయి, ఆద్వారంగుండా గదిలోనికి వచ్చినవారు పోయిగా బయటికి వెళ్ళిపోవచ్చు ఇలా రావడం అలా వెళ్ళిపోవడమన్నమాట. అయితే నా రూపాయిలకు సున్న చుట్టుకున్నదన్నమాట అనుమానం లేదు అన్నమాటే. నేను బావురుమన్నాను. ఈసారి నా గాబరా ఆ గదిలోని వారికంటుకుంది. చేర్ మెన్ కుర్చీలోంచి లేచి యేంబాబు అలా అయిపోయావేం? యేం కావాలి నీకు? యెందుకొచ్చావు? అంటూ ప్రశ్నలవర్షంతో ముంచెత్తాడు, నాకేమి బోధపడడంలేదు. ఆయన ప్రశ్నలకేం జవాబివ్వాలో తోచడమూలేదు. నన్ను నేను సంబాళించుకుని 'నా డబ్బుపోయింది సార్' అన్నాను. 'ఈ గదిలోనా?' అన్నాడాయన. కాదు ఈ ద్వారంగుండా వెళ్ళిపోయింది, నా డబ్బుపోయింది సార్ అని కూలబడిపోయాను. ఆయన అసలుసంగతేమిటంటూ నన్ను కూర్చోబెట్టి ఓపిగ్గా అడుగసాగాడు. నేను అసలుసంగతి వివరించాను. ఆయనోమారు అంతవరకు చందా కట్టినవారి పేర్లన్నీ తిరగేసి చూశాడు. అందులో నా పేరు లేదు, 'నీ పేరిట యెవరూ చందా కట్టలేదు' అని ఆయన నిట్టూరుస్తూ చెప్పాడు. అప్పటికే నాశరీరం చెమటలో తడిసిపోయింది. ఆ తడిని ఆర్చి నన్నోదారుస్తుంది ప్రక్కకే ఉన్న ఫ్యాన్. కాని మానసిక ఆందోళనమాత్రం తగ్గడంలేదు. ఊరునుండి వస్తున్నప్పుడు డబ్బు చేతికిచ్చి జాగ్రత్తగా ఖర్చు పెట్టుకొమ్మని చెప్పిన అన్నమాట మరీ కంపరం పుట్టించింది. చేర్మన్ గారు తను చేయగలిగిందేమీ లేదన్నట్టులేచి వెళ్ళి తన పనిలో మునిగిపోయాడు. నేను దిక్కుతోచక గదినుండి బయటికి నడిచాను. బయటి ఆవరణనంతా కలయ తిరిగాను యెక్కడైనా వాడు కనిపిస్తాడేమోనని. కాని వాడెందుకు కనిపిస్తాడు, హాయిగా ఆ రూపాయలతో అప్పటికే యెక్కడ తేలియాడుతున్నాడో? బిక్కమొగంతో చెట్టుక్రిందికెళ్ళి కూలబడితే మిత్రులు కనిపించారు, 'ఏరా చందా మాఫీ చేయించుకున్నావా?' అన్నవారి ప్రశ్నలకు సూటిగా జవాబు చెప్పకుండా, 'పుణ్యకార్యానికి పోవాల్సిన డబ్బు పాపిచేతిలో పడ్డాయిరా' అని మాత్రం అన్నాను.

